చేరువలో దవాఖానాలు

- కొవ్వూరులో రెండు చోట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- రెండింటికీ కలిపి రూ.2.30 కోట్ల వ్యయం
- తుది మెరుగులు దిద్దుకుంటున్న భవనాలు



కొవ్వూరు శ్రీనివాసపురంలో నిర్మాణం పూర్తి కావచ్చిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర భవనం

కొవ్వూరు: పేదల వైద్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పట్టణ వాసులకు కిలోమీటరు లోపు దూరంలోనే ఆసుపత్రులను నిర్మించి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. పట్టణంలో రూ.2.30 కోట్ల వ్యయంతో కొత్తగా రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నారు. మరోపక్క వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి గ్రామస్థాయిలోనే నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. కొవ్వూరు పట్టణంలో చేపట్టిన రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఆధునిక హంగులతో ప్రారంభానికి దాదాపు సిద్ధమయ్యాయి. మెరక వీధిలో క్రిస్టియన్ పేటను ఆనుకుని ఈజీకే రోడ్డు పక్కనే రూ.1.07 కోట్ల వ్యయంతో ఒక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే శ్రీనివాసపురం సమీపంలోని టోల్ గేట్ జంక్షన్ వద్ద రూ.1.23 కోట్ల వ్యయంతో మరో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ రెండు భవనాల నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చాయి. వచ్చే నెలలో వాటి ప్రారంభోత్సవానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు అర్బన్ హెల్త్ కేంద్రాలు అందుబాటులోకి, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)తో కలిపి మూడు ఆసుపత్రుల ద్వారా పట్టణ వాసులు వైద్య సేవలు పొందవచ్చు.

కొత్త భవనాల్లో ఇవీ వసతులు

కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాల్లో రెండేసి చొప్పున ఆపరేషన్ థియేటర్లు ఉంటాయి. అలాగే ఫార్మసీ రూము, ల్యాబ్, మినీ వార్డు, వెయిటింగ్ హాలు, లేబర్ రూమ్, మైనర్ ఓటీ, మీటింగ్ హాలు, ఓపీ గదులు ఉంటాయి. క్రిస్టియన్ పేట ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వస్తే ఒకటి నుంచి ఆరు వార్డుల వాసులతో పాటు 23వ వార్డు ప్రజలకు కూడా వైద్య సేవలు మరింత చేరువ అవుతాయి. పట్టణానికి మధ్యలో ఉన్న సీహెచ్‌సీ 7,8, 9,10,12,13, వార్డుల వారి వైద్యానికి సౌకర్యంగా ఉంటుంది. ఇక శ్రీనివాసపురంలో ముస్తాబవుతున్న ఆరోగ్య కేంద్రం ఔరంగాబాద్, శ్రీనివాసపురం, వాంబే కాలనీ, బ్రిడ్జిపేట, వేములూరు గ్రామస్తులకు బాగా సౌలభ్యంగా ఉంటుంది. ఇప్పటి వరకూ పట్టణ శివారు ప్రాంతాల ప్రజలు ఆసుపత్రికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం వరకూ ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు కిలోమీటరు దూరంలోనే సేవలు అందు బాటులోకి రానున్నాయి. సీహెచ్‌సీ కాకుండా ప్రస్తుతం క్రిస్టియన్‌పేటలో ఒకటి, గాయత్రీ థియేటర్ సెంటర్ వద్ద మరొక అర్బన్ హెల్త్ సెంటర్ నడుస్తున్నాయి. నూతన భవనాలు పూర్తయితే ఆ రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఈ భవనాల్లోకి తరలిస్తారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈజీకే రోడ్డును అనుకుని నిర్మిస్తున్న వైఎస్సార్ అర్బన్ క్లినిక్ భవనం

పెద్దాసుపత్రి సేవలు అదనం

పట్టణంలో ప్రస్తుతం 50 పడకల ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నడుస్తోంది. రోజుకు ఇక్కడ సరాసరిన 400 మంది సేవలు పొందుతున్నారు. నెలకు 70 నుంచి 80 డెలివరీలు, సుమారు 400 మైనర్, 50 మేజర్ సర్జరీలు చేస్తున్నారు. అన్నిరకాల వైద్య సేవలూ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర, జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఏడు మండలాల పరిధిలోని 1,08,445 మంది ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక వైద్య సేవలు, ఇతర వైద్య సేవలు అందిస్తారు. అవసరమైన రోగులను మెరుగైన వైద్య సేవల కోసం సామాజిక ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. ఇక్కడి ల్యాబ్‌లో 40 రకాల పరీక్షలు చేయవచ్చు. ఈసీజీ, ఎక్స్‌రే, స్కానింగ్ వంటివి ఇక్కడ అందుబాటు ఉన్నాయి.

పేదల వైద్యానికి పెద్దపీట



భవిష్యత్తులో ఏ పేదవాడూ వైద్యం అందక ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు ఆసుపత్రులు అందుబాటులోకి వస్తే పట్టణ వాసులకు రానున్న రోజుల్లో వైద్య సేవలు మరింత చేరువ అవుతాయి.

–బావన రత్నకుమారి, మునిసిపల్ చైర్‌పర్సన్, కొవ్వూరు

ప్రారంభానికి సిద్ధం చేశాం



అర్బన్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఆసుపత్రి భవనాలను ప్రారంభానికి సిద్ధం చేస్తున్నాం. హోం మంత్రి తానేటి వనిత వాటిని ప్రారంభిస్తారు.

–బి.శ్రీకాంత్,కమిషనర్, కొవ్వూరు పురపాలక సంఘం

క్లుప్తంగా

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లజర్ల: మండలంలోని అచ్చన్నపాలెం, అనంతపల్లి, తెలికిచెర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ గోపాలపురం సీడీపీఓ వైబీ సుందరి తెలిపారు. అచ్చన్నపాలెంలో–2 ఖాళీని ఓపెన్ కేటగిరీకి, అనంతపల్లిలో–4 ఖాళీని బీసీ–డి.కి కేటాయించారు. తెలికిచెర్లలో –2ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. దరఖాస్తుదారులు స్థానికులైన వివాహితులై ఉండాలి. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబరు 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా గోపాలపురం సీడీపీఓ కార్యాలయంలో స్వయంగా అందజేయాలన్నారు.

చాగల్లులో డ్రైన్లకు భూమి పూజ



సీసీ డ్రైన్లకు భూమిపూజ చేస్తున్న గంద్రోతు సురేంద్రకుమార్, నాయకులు

చాగల్లు: చాగల్లు సచివాలయం–3 పరిధిలో నిర్మించే సీసీ డ్రెయిన్లకు బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్ర కుమార్ తదితరులు భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షల వ్యయంతో ఈ డ్రెయిన్లు నిర్మిస్తారు. తొలుత అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, ఉప సర్పంచ్ మేకా రాజు, పార్టీ నాయకులు వర్ధినేడి చినబాబు, బొర్రా కృష్ణారావు, ఉన్నమట్ల బ్రాహ్మానందం, ఇంటి వీర్రాజు, జాలెం వెంకట్రావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ల్యాబ్ భవనానికి శంకుస్థాపన

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంలో నిర్మించే పబ్లిక్ హెల్త్ యూనిట్ (ఆధునిక ల్యాబ్) భవనానికి గురువారం ఉదయం 10 గంటలకు నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు శంకుస్థాపన చేస్తారని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలివెన్నులో గ్రామంలో నిర్వహించే లక్ష్మీగణపతి ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొని, స్వామి వారిని దర్శించుకుంటారని జెడ్పీటీసీ సభ్యుడు తెలిపారు.

నేడు కాటకోటేశ్వరంలో హెల్త్ క్లినిక్ ప్రారంభం

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరంలో నిర్మించి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు గురువారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ పి.శామ్యూల్ బుధవారం తెలిపారు. అనంతరం అదే గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు.

పాలంగి సొసైటీకి రూ.9.7 లక్షల లాభం



మహాజన సభలో మాట్లాడుతున్న పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరం: గత (2022–23) ఆర్థిక సంవత్సరంలో మండలంలోని పాలంగి సొసైటీకి రూ.9.7 లక్షల నికర లాభం వచ్చిందని ఆ సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఆ సొసైటీ మహాజన సభ బుధవారం సొసైటీ కార్యాలయంలో జరిగింది. చైర్మన్ నాగిరెడ్డి 2022–23లో నిర్వహించిన సొసైటీ లావాదేవీలను, జమా ఖర్చులను సభ్యులకు వివరించారు. సొసైటీ 2022–23 సంవత్సరానికి 100 శాతం రుణాలను వసూలు చేసిందన్నారు. సొసైటీ రైతులకు రూ.రూ.10 కోట్ల దీర్ఘకాలిక, పంట రుణాలు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు వేండ్ర లక్ష్మిలతో పాటు మేళం కుటుంబరావు, వెలిచేటి జానకిరామయ్య, బోస్, బోల్లాడ రంగారావు, సఖినాల రామకృష్ణ, బసవా రామారావు, సీఈవో విష్ణుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

అజ్జరం సొసైటీకి జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు



డీసీసీబీ చైర్మన్ నరసింహారావు నుంచి అవార్డు అందుకుంటున్న సొసైటీ అధ్యక్షుడు సబ్బెళ్ల సత్తిరెడ్డి

పెరవలి: రైతుల వద్ద నుంచి నూరు శాతం రుణాలను రికవరీ చేసినందుకు అజ్జరం సొసైటీకి జిల్లా స్థాయిలో ఉత్తమ సొసైటీ పురస్కారం లభించింది. ఏలూరులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అజ్జరం సొసైటీ అధ్యక్షుడు సబ్బెళ్ళ సత్తిరెడ్డికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారావు ఈ అవార్డును అందజేశారు. 2022–23 సంవత్సరంలో అజ్జరం సొసైటీ స్వల్పకాలిక రుణాలు రూ.225.25 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.29.25 కోట్లు రైతులకు మంజూరు చేసింది. ఈ మొత్తం రుణాలను ఈ ఏడాది ఆగస్టు నెలలోనే పూర్తిగా వసూలు చేసినందుకు ఆ సొసైటీకి ఈ అవార్డు లభించింది.

రోడ్డు కం రైల్ వంతెన మరమ్మతులు ప్రారంభం



కొవ్వూరు- రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు వంతెన మరమ్మతుల విషయమై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్. చిత్రంలో కొవ్వూరు చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన మరమ్మతులకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు మరమ్మతులు కొనసాగ నున్నందున రాజమహేంద్రవరం– కొవ్వూరు మధ్య రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలన్నారు. వంతెన నిర్మాణం పూర్తయి, ఇప్పటికే యాభై ఏళ్ల పూర్తి కావస్తోందన్నారు. భారీ వాహనాల రాకపోకలపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ హెవీ వెహికిల్స్ తిరగడం వల్ల వంతెన దెబ్బతిందన్నారు. ఈ నెల 29న నిర్వహించే రైల్వే, ఆర్ అండ్ బీ శాఖల సంయుక్త సమావేశంలో ఈ వంతెనకు శాశ్వత మరమ్మతులపై నిర్ణయం తీసుకోగలరన్న ఆశాభావాన్ని ఎంపీ వ్యక్తం చేశారు. రోడ్డు కం రైలు వంతెన శాశ్వత మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 కోట్లు డిపాజిట్ చేస్తే, రైల్వే శాఖ రూ.2.97 కోట్లు భరిస్తుందన్నారు. ఈ నిధులతో వంతెన రెయిలింగ్, ఫుట్‌పాత్ లతో సహా అన్ని మరమ్మతులను పూర్తి చేయవచ్చన్నారు. ప్రస్తుతం వంతెనపై ఉన్న 30 ఎంఎం తారు లేయర్‌ను పూర్తిగా తొలగించి ఆధునిక పరిజ్ఞానంతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారన్నారు. కొవ్వూరు మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, ఆర్ అండ్ ఆర్ బీ డీఈఈ బాలదారి మధుసుధనరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.7.35 కోట్లతో జగనన్న కాలనీలకు నీటి వసతి

- 21 అంశాలకు కౌన్సిల్ ఆమోదం
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను జగనన్న లేఅవుట్‌లలో నీటి వసతి కల్పనకు ఖర్చు చేసేందుకు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేయాలని కొవ్వూరు మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్లలో నీటి వసతి కల్పనకు అమృత్ 2.0లో భాగంగా రెండో విడత కింద కేంద్ర ప్రభుత్వం రూ.7.36 కోట్లు మంజూరు చేసింది. కాగా పట్టణంలో పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునే అంశంపై గత కౌన్సిల్ సమావేశంలో వాయిదా పడిన మూడు అంశాలనూ ఈ సమావేశంలో రద్దు చేశారు. ఆరో వార్డులో మోహర్‌బాబా గుడి దగ్గర సీసీ రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 5,9 వార్డుల్లో కల్వర్టులు, డ్రెయిన్‌ల నిర్మాణం, పలుచోట్ల చేతిపంపుల ఏర్పాటు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన వార్డులకు మంజూరైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 3,5,6,7 వార్డుల్లో రూ.28 లక్షల వ్యయంతో తొమ్మిది పనులు చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయించింది. పదో వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో అన్నీ వార్డుల్లోను గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయినందున అన్ని వార్డుల్లోనూ పనులకు ప్రతిపాదించాలని సూచించారు.

పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, కంఠమణి రమేష్ కోరారు. పట్టణంలో కుక్కలు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ బి.శ్రీకాంత్ ప్రకటించారు. వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

లంబోదరుడి లడ్డూ రూ.1.16 లక్షలు



వేలంలో దక్కించుకున్న లడ్డూతో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న



చాగల్లు తెలగా సంఘం వినాయకుని గుడి వద్ద లడ్డూ ప్రసాదం పాడుకున్న వారికి సన్మానం

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో ప్రతిష్ఠించిన శ్రీలక్ష్మి గణపతి స్వామి వారికి సమర్పించిన లడ్డూకు బుధవారం వేలం నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న రూ.1.16 లక్షలకు వేలంలో ఈ లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వీరన్నని ఘనంగా సత్కరించారు.అనంతరం ఊరేగింపుగా లడ్డూని వీరన్న ఇంటికి తీసుకువెళ్లారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు చౌటుపల్లి శ్రీనివాసరావు,పెరుగు సాంబశివరావు, జద్దు పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

రూ.64వేలకు చాగల్లు వినాయకుడి లడ్డూ

చాగల్లు: గణపతి నవ రాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలగా సంఘం ఆధ్వర్యంలో చాగల్లులో ప్రతిష్ఠించిన వినాయకుడికి సమర్పించిన 101 కిలోల లడ్డూకు బుధవారం వేలం నిర్వహించారు. ఈ లడ్డూను రూ.64 వేలకు చాగల్లుకు చెందిన పురంశెట్టి సీతారాములు దక్కించుకున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు గంద్రోతు సురేంద్రకుమార్ తెలిపారు. సీతారాములును తెలగా సంఘం పెద్దలు ఘనంగా సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. అలాగే చాగల్లు వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి సమర్పించిన 19 కిలోల లడ్డూను వేలం వేయగా రూ.19 వేల ధర పలికిందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రంధి రాంబాబు తెలిపారు.

కాశీకి ఉత్తమ సేంద్రియ రైతు పురస్కారం



రాజమహేంద్రవరం సీటీఆర్ఐలో ఉత్తమ సేంద్రియ రైతు అవార్డు అందుకుంటున్న కాశీ విశ్వనాథం

పెరవలి: సేంద్రియ సాగులో విశేష కృషి చేస్తున్న మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన ముళ్లపూడి కాశీ విశ్వనాథానికి ఉత్తమ సేంద్రియ రైతు అవార్డు లభించింది. రాజమహేంద్రవరంలో సీటీఆర్ఐ డైరెక్టర్ శేషు మాధవ్ బుధవారం ఈ అవార్డును కాశీ విశ్వనాథానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శేషు మాధవ్ ఘనంగా సత్కరించారు. ఎనిమిదేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న కాశీ విశ్వనాథాన్ని సేంద్రియ వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ తాతారావు బాగా ప్రోత్సహించారు. దాంతో ఆయన సేంద్రియ కషాయాలు, సేంద్రియ ఎరువులు విక్రయ కేంద్రాన్ని నెలకొల్పారు. అంతేగాకుండా ముక్కామలతో పాటు పరిసర నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, ముత్యాలవారిపాలెం, ఉమ్మిడివారిపాలెం గ్రామాల రైతులను ప్రోత్సహించి, సుమారు 800 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం విస్తరించడానికి కాశీ విశ్వనాథం కృషి చేశారు. ఈ క్రమంలో సీటీఆర్ఐ ఆయనకు ఉత్తమ సేంద్రియ రైతు అవార్డు అందించి, సత్కరించింది. అంతేగాకుండా సేంద్రియ ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం చేయడానికి కాశీవిశ్వనాథంతో రాజమహేంద్రవరం సీటీఆర్ఐ బుధవారం ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

అసెంబ్లీలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నిడదవోలు: విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడారు. అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం ఏటా ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు. నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రెండేసి జూనియర్ కళాశాలలను ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.47 కోట్ల వ్యయంతో నాడు–నేడు ద్వారా పాఠశాలలను ప్రభుత్వం ఆధునీకరించిందన్నారు. పెరవలి మండలం అన్నవరప్పాడులో మండల పరిషత్ పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు దూబచర్ల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన దూబచర్ల హైస్కూల్ విద్యార్థులు

నల్లజర్ల: స్కూల్ గేమ్స్ అండర్–17 రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మండలంలోని దూబచర్ల హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ స్కూల్ హెచ్ఎం బి.సుమతి తెలిపారు. ఈనెల 26న భీమవరం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు చేబ్రోలు రాజశేఖర్ (2వ స్థానం), దుర్గాప్రసాద్ (5వ స్థానం) సంఘమిత్ర విద్యాలయం (దూబచర్ల) విద్యార్థి మణిదీప్ (3వ స్థానం) సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ఆమె వివరించారు.

పుప్పాల వెంకటరావు ప్రమాణ స్వీకారం



కనీస వేతన సలహా మండలి చైర్మన్‌తో పాటు సభ్యుడు పుప్పాలను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండల నాయకులు

తాళ్లపూడి: ఆంధ్రప్రదేశ్ కనీస వేతన సలహామండలి సభ్యుడిగా నియమితులైన మండలంలోని రావూరుపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుప్పాల వెంకటరావు బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ బుధవారం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్‌గా వి.రఘునాథరెడ్డి, సభ్యులుగా పుప్పాల వెంకటరావు, ఎం. వెంకటరమణ బుధవారం విజయవాడలోని కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలో పుప్పాల వెంకటరావును వైఎస్సార్ సీపీ మండల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు వంబోలు పోశిబాబు, పిట్టా శ్రీనివాస్, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, చిట్టూరి అన్నవరం తదితరులు ఆయనను అభినందించిన వారిలో ఉన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్



వసతి గృహం విద్యార్థులతో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ సూర్యప్రభావతి

కొవ్వూరు: స్థానిక క్రిస్టియన్ పేటలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఏపీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి బుధవారం రాత్రి పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతుల గురించి ఆమె ఆరా తీశారు. నూతన భవనాల నిర్మాణం గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో, విద్యార్థులు రాత్రి పూట సమీపంలోని పాఠశాల భవనంలో నిద్రిస్తున్నారని వార్డెన్ ముప్పిడి రాజు తెలిపారు. నూతన భవనాలను మంజూరు చేయించాలని కోరుతూ ఈ సందర్భంగా వార్డెన్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి అందిన దుప్పట్లను సూర్యప్రభావతి చేతుల మీదుగా హాస్టల్ విద్యార్థులకు అందజేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, స్టేట్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్.మేరీమాత, బొంతా శ్యాం రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

పెరవలి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఈనెల 30 నుంచి అక్టోబర్ 28 వరకూ నిర్వహిస్తామని ఎంపీడీఓ దామోదరరావు తెలిపారు. ఈ నెల 30న కానూరు, అక్టోబర్ 3న కాపవరం, 4న మల్లేశ్వరం, 5న అన్నవరప్పాడు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. అలాగే 6న పిట్టల వేమవరం, 9న పెరవలి, 11, 12 తేదీల్లో ముక్కామల, 13,16 తేదీల్లో ఖండవల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. అలాగే 17న తీపర్రు, 18న కానూరు అగ్రహారం, 19న కాకరపర్రు, 20న అజ్జరం, 21న ఖండవల్లి గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 25న ఉసులుమర్రు, 27న నడుపల్లి, 28 న కొత్తపల్లి అగ్రహారం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు.